## క్లుప్తంగా

### కొనసాగుతున్న 'ధరణి' స్పెషల్ డ్రైవ్

కామేపల్లి: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ సుధాకర్ ఆధ్వర్యాన శనివారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తుదారుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి 262 ధరణి పెండింగ్ సమస్యలు ఉండగా, తమ పరిధిలోని 149 పెండింగ్ దరఖాస్తులు ఉన్నట్లు తహసీల్దార్ చెప్పారు.

### మాలధారుల పాదయాత్ర

కూసుమంచి: మండలంలో శివమాల ధరించిన భక్తులు శనివారం కూసుమంచిలోని శివాలయం నుంచి జీళ్లచెరువులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. అక్కడ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశాక తిరుగు ప్రయాణంలో జక్కేపల్లిలోని సాయిబాబా ఆలయంలో భజనలు నిర్వహించారు. మాలధారుల శివనామస్మరణతో పాదయాత్ర మార్మోగింది.

### ఆలయ నిర్మాణానికి విరాళం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందించారు. శనివారం ప్రశాంత్‌నగర్‌కు చెందిన మల్లెంపాటి శ్రీనివాసరావు, నరసమ్మ దంపతులు రూ.10,116లను ఆలయ కమిటీ వారికి అందించారు.

### నేడు అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: అరుదైన వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ అధ్యక్షుడు, సీఈఓ ముత్యాల రామయ్య అన్నారు. నేడు (ఆదివారం) స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్(ఐఎంఏ)లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అరుదైన వ్యాధులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తుండగా.. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, వైద్యాధికారులు, నిపుణులు సదస్సులో పాల్గొంటారన్నారు.

### ఉచిత వైద్య శిబిరం విజయవంతం



మందులు అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మంచికంటి హాల్‌లో సీపీఎం టూటౌన్ కమిటీ, బీవీకే సంయుక్త ఆధ్వర్యాన శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరాన్ని నగర వ్యాపార ప్రముఖులు బొల్లినేని వెంకటేశ్వరరావు, పెండ్లి శ్రీనివాసరెడ్డి ప్రారంభించి మందులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా ప్రతీ నెల మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు నారగాని రాంప్రసాద్, సి.భారవి, రావిళ్ల రంజిత్, కొల్లి అనుదీప్‌లు బాధితులను పరీక్షించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు, సుబ్బారావు, బోడపట్ల సుదర్శన్, శివనారాయణ, పి.ఝాన్సీ, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, పి.వాసు, అఫ్జల్, పి.కృష్ణారావు, అరుణా తదితరులు పాల్గొన్నారు.

### సీఈఓ అప్పారావు సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న నూతన సీఈఓ వినోద్, పక్కన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: జెడ్పీ సీఈఓగా జిల్లాలో విధులు నిర్వర్తించిన వీ.వీ.అప్పారావు సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. బదిలీపై వెళ్లిన సీఈఓ అప్పారావు, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్‌ను జెడ్పీ ఉద్యోగుల ఆధ్వర్యాన సన్మానించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్, నూతన సీఈఓ వినోద్ మాట్లాడారు. అనంతరం పలువురు ఎంపీడీఓలు మాట్లాడుతూ అప్పారావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | ఊరుపేరు భైరవకోన |
| వినోద | ఆపరేషన్ వాలెంటైన్ |
| సాయిరాం | డ్యూన్ |
| ఆదిత్య | కిక్ |
| శ్రీనివాస | చారి 111 |
| సుందర్ | హనుమాన్ |

- ఖమ్మంగాంధీచౌక్

# భవితకు వారధి.. పార్థసారధి

**ఎంపీ బండి పార్థసారథిరెడ్డి దాతృత్వం చిరకాలం**

- ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలకు హంగులు
- ఒక అంతస్తు నిర్మాణంతో పాటు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మాణం

సండే స్పెషల్



ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ కోసం నిర్మిస్తున్న అంతస్తు

ఆయన ఓ వ్యాపారవేత్త.. కోట్లకు అధిపతి.. అయినా ఈ స్థాయికి తీసుకొచ్చిన వారిని మరువలేదు. తాను చదువుకున్న కళాశాలకు ఏదో చేయాలనే తపన వెంటాడింది. ప్రభుత్వ కళాశాల అయినప్పటికీ కార్పొరేటు స్థాయిలో హంగులు దిద్దాలనే ఆకాంక్షతో ఏకంగా ఒక ఫ్లోర్ నిర్మాణంతో పాటు కంప్యూటర్ ల్యాబ్ ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాడు. ఆ దాత ఎవరో కాదండి ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, హెటిరో డ్రగ్స్ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి.

– ఖమ్మం సహకారనగర్

**కళాశాలకు ఎంపీ సహకారం..**

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి అయిన పార్థసారధిరెడ్డి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి కావడంతో కళాశాల బృందం కళాశాలకు కావాల్సిన అంశాలపై ప్రస్తావించాక కంప్యూటర్ ల్యాబ్ అవసరముందని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన ల్యాబ్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. దీంతో కళాశాల ఆవరణలోని పరిపాలన విభాగం కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో ఉండగా... రెండో అంతస్తును నిర్మించడంతో పాటు కంప్యూటర్ ల్యాబ్‌కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

**సుమారు రూ.కోటి వ్యయంతో..**

విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు సుమారు కోటి రూపాయలు ఖర్చువుతున్నట్లుగా తెలుస్తోంది. ఖర్చుకు వెనుకడుగు వేయకుండా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించటమే లక్ష్యంగా ఎంపీ ముందుకెళ్తున్నట్లుగా అధ్యాపకవర్గం చెబుతుంది.

**వచ్చే విద్యా సంవత్సరం అందుబాటులోకి..**

కంప్యూటర్ ల్యాబ్ భవన నిర్మాణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. కంప్యూటర్ ల్యాబ్ త్వరితగతిన వినియోగంలోకి రానుండగా.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి రానున్నట్లుగా తెలుస్తోంది.

**విద్యకు మరింత ప్రాధాన్యం..**

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల జిల్లాలోనే అతిపెద్ద కళాశాల. గతంలో ఎంసెట్, పాలిసెట్, ఐసెట్ ఆన్‌లైన్ విధానంలో జరిగే పోటీ పరీక్షలకు పలుమార్లు ఈ కళాశాల ప్రిన్సిపాలే కో ఆర్డినేటర్‌గా వ్యవహరించే వారు. అలాంటి కళాశాలకు పరీక్షా కేంద్రం ఉండే అవకాశం లేకుండాపోయింది. ప్రధాన కారణం కంప్యూటర్ ల్యాబ్ లేకపోవడం. కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటైతే విద్యార్థులకు ఉపయోగం జరుగుతుందనే ఆలోచనతో కళాశాల బృందం ఎంపీ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో ఆయన కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా.. భవిష్యత్తులో ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఆధ్వర్యాన జరిగే జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ తదితర ఆన్‌లైన్ పోటీ పరీక్షలకు ఈ కళాశాల పరీక్షా కేంద్రంగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

**విద్యార్థులకు దోహదం..**



బండి పార్థసారధిరెడ్డి కళాశాల పూర్వ విద్యార్థిగా, ఎంపీగా కళాశాలలో రెండు రసాయన శాస్త్ర ల్యాబ్‌లను అంతర్జాతీయ స్థాయిలో అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు భవన నిర్మాణ పనులు, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ల్యాబ్ చాలా మంది విద్యార్థులకు దోహదపడనుంది. తమ కళాశాలలో ల్యాబ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం.

– మాదాల సుబ్రహ్మణ్యం, యూజీసీ, అటానమస్ కో ఆర్డినేటర్

**ఎంతో ఉపయోగం..**



బండి పార్థసారధిరెడ్డి సుమారు రూ.కోటి వ్యయంతో అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌ను నిర్మిస్తుండడం ఎంతో ఆనందంగా ఉంది. విద్యార్థులకు ఇలాంటి ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. న్యాక్ ఏ ప్లస్ ప్లస్ సాధన ద్వారా మరింత అగ్రస్థానానికి చేరుకునేందుకు దృష్టి సారించాం. పోటీ పరీక్షలకు పరీక్షా కేంద్రంగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

– మహ్మద్ జకీరుల్లా, కళాశాల ప్రిన్సిపాల్

**నాణ్యమైన విద్యకు పునాది..**



కళాశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు దాతల సహకారంమరింత దోహదం కానుంది. ఎంపీ పార్థసారధి రెడ్డి కళాశాలలో విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్‌ను నిర్మించి ఇచ్చేందుకు ముందుకు రావటం.. పనులు కూడా వెంటనే జరుగుతుండడంతో విద్యకు ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంది.

– గొల్లపల్లి ప్రదీప్, కళాశాల విద్యార్థి

**ఆనందంగా ఉంది..**



కళాశాలలో విద్యార్థులకు అవసరమైన ల్యాబ్‌ను ఎంపీ బండి పార్థసారధిరెడ్డి నిర్మించి ఇస్తుండడం ఆనందరంగా ఉంది. మా కళాశాల పూర్వ విద్యార్థి ఎంపీ స్థాయికి ఎగదడంతో పాటు విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణ పనులు జరిపిస్తున్నందుకు ఎంపీపై గౌరవం పెరిగింది. విద్యార్థులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– మౌనిక, కళాశాల విద్యార్థిని

## పల్స్ పోలియోను విజయవంతం చేయండి



నేలకొండపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి/కూసుమంచి/కామేపల్లి: మండలాల్లో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ ఎం.యర్రయ్య, కూసుమంచి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిశోర్‌కుమార్, కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చందన తెలిపారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల కల్లా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈనేపథ్యాన నేలకొండపల్లి మండలంలో 1,971 మంది, కూసుమంచి మండలంలో 5,244 మంది, కామేపల్లి మండలంఓ 2,832 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించామని, వారికి పోలియో చుక్కలు వేసేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. కాగా, నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడగా.. కిశోర్‌కుమార్, చందనలు ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో నేలకొండపల్లి మండల వైద్యాధికారి డాక్టర్.రచ్చా శ్రావణ్‌కుమార్, వీరన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



టీషర్ట్‌లు అందిస్తున్న ముత్యాల రామయ్య

కామేపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ సీఈఓ ముత్యాల రామయ్య అన్నారు. శనివారం మండలంలోని కొమ్మినేపల్లి హైస్కూల్‌లోని క్రీడాకారుల విద్యార్థులకు ముత్యాల లాలయ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సుమారు రూ.15 వేలు విలువైన టీషర్ట్‌లు, బూట్లు ఇతర సామగ్రిని అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు తమ ట్రస్ట్ ముందుంటుందన్నారు. అనంతరం రామయ్యను పాఠశాల ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, రమాప్రభ, జ్యోతి, విజయకుమారి, సుధాకర్, నాగేశ్వరరావు, రవికుమార్, ఉషా పాల్గొన్నారు.

## పేదలకు ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యం



జీరో బిల్లు ఇస్తున్న ఎంపీపీ మంగీలాల్

తిరుమలాయపాలెం: ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం జీరో బిల్లు అందిస్తుందని మండల ఎంపీపీ బోడ మంగీలాల్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని తిప్పారెడ్డిగూడెం గ్రామపంచాయతీలో 200 యూనిట్ల విద్యుత్ కనెక్షన్లను పరిశీలించి అర్హులైన పేదలకు జీరో బిల్లులు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఎన్నికల హామీల్లో ప్రస్తావించిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల సమక్షంలో అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ స్పీకర్ దుద్దిళ్ల జయంతి



తిరుమలాయపాలెం: నివాళులర్పిస్తున్న ఎంపీపీ మంగీలాల్, తదితరులు

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఎంపీపీలు వజ్జా రమ్య, బోడ మంగీలాల్‌నాయక్‌కు మాట్లాడుతూ.. తొలి దశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్ర సమస్యలను అసెంబ్లీలో గర్జించిన మహనీయుడు శ్రీపాదరావు అని, వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓలు ఎం.యర్రయ్య, శేషాద్రి, ఈజీఎస్ ఏపీఓ సునీత, టీఏ శైలజ, యాకయ్య, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకుడు బైరం దినేశ్‌కుమార్, తిరుమలాయపాలెం జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీటీసీ బొందయ్యతో పాటు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 25 వరకు ఇండియన్ షాపింగ్ ఎక్స్‌పో



గృహ అలంకరణ వస్తువుల విక్రయాలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ షాపింగ్ ఎక్స్‌పోను ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అశోక్ తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఉంటుందన్నారు. మహా శివరాత్రి, హోలీ పండగల సందర్భంగా సూపర్ ధమాకా సేల్ ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

## ఒకే దఫాలో మూడు ఉద్యోగాలు..



అంతోటి దేవిక



వేమూరి ప్రమీల

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: ఒకే దఫాలో మూడు ఉద్యోగాలు సాధించిన ఇద్దరు యువతులు నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు. ఇటీవల ప్రభుత్వం గురుకుల సొసైటీ ఉద్యోగ పరీక్షల ఫలితాలు వెల్లడించగా.. టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలకు వారు ఎంపికయ్యారు. ఖమ్మం రూరల్ మండలం కామంచికల్ గ్రామానికి అంతోటి అయోధ్య, సుజాత దంపతుల కూతురు అంతోటి దేవిక, కొండాపురం గ్రామానికి చెందిన వేమూరి వెంకటేశ్వర్లు, భద్రమ్మల కుమార్తె ప్రమీలలు ఒకే ప్రయత్నంలో మూడు ఉద్యోగాలు సాధించారు. కాగా దేవిక హైదరాబాద్‌లో పీజీటీ గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తుండగా.. ప్రమీల పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంది. ఈమేరకు గ్రామస్తులు వారిని అభినందించారు..

## అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వండి



మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: దశాబ్దాల తరబడి పేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్, బంజరు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కోరారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవనంలో శనివారం సీపీఐ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించగా ప్రసాద్ మాట్లాడారు. ధరణి సైట్‌లో చేపడుతున్న సంస్కరణలు పేద, మధ్యతరగతి రైతాంగానికి సానుకూలంగా ఉండేలా చూడాలన్నారు. రికార్డులకెక్కని లక్షలాది ఎకరాల భూమికి పాస్ పుస్తకాలు అందించాలని కోరారు. ఏళ్ల కిందట లక్షలాది మంది పేదలకు అసైన్డ్ భూములు పంపిణీ చేయగా, అందులో చాలావరకు పారిశ్రామిక వేత్తలు, సంపన్నవర్గాలు ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పేద రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. కాగా, కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాల బాధ్యులు నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎస్‌కే జానీమియా, శింగు నర్సింహారావు, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయం



మాట్లాడుతున్న పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాల్లోని పలు గ్రామాలలో శనివారం ఆయన పర్యటించి పలువురిని పరామర్శించడంతో పాటు నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెట్టించేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారని చెప్పారు. గువ్వలగూడెంలో దళిత కాలనీకి రహదారి, తాగునీటి కోసం పైపులైన్ మంత్రి ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ వజ్జా రమ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, బచ్చలకూరి నాగరాజు, కళ్లెం వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి, బండి జగదీశ్, రామ్మూర్తినాయక్, తమ్మినేని నవీన్, తదితరులు పాల్గొన్నారు.

### వల్లూరి వెంకయ్య ఆశయాలను సాధిద్దాం..

రఘునాథపాలెం: తాను నమ్మిన సిద్ధాంతాల కోసం కడదాక ఎర్రజెండా నీడన అమరుడైన వల్లూరి వెంకయ్య ఆశయాలను సాధిద్దామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఖమ్మం జిల్లా నాయకురాలు ఆవుల మంగతాయి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చింతగుర్తిలో వెంకయ్య సంతాపసభ నిర్వహించగా ఆమె మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల నాయకులు షేక్ మదర్‌సాహెబ్, లింగన్నబోయిన నాగేశ్వరరావు, ముత్తిలింగం, ఆదెపు సత్యం, లింగన్నబోయిన రామ్మూర్తి, పుల్లయ్య, రామయ్య, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ బ్యాటరీల చోరీపై కేసు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లిలో ఇంటి బయట పెట్టిన ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు చోరీ చేసిన ఘటనపై శనివారం కేసు నమోదైంది. జల్లెపల్లికి చెందిన పోట్ల కిరణ్, జగదీశ్ తమ ఇళ్ల ఎదుట ట్రాక్టర్లు నిలిపారు. గతనెల 29న అర్ధరాత్రి దుండగులు సుమారు రూ.17వేల విలువైన బ్యాటరీలను ఎత్తుకెళ్లడంతో బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదైంది.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

నేలకొండపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు శనివారం సీజ్ చేశారు. ముదిగొండ మండలం నుంచి నేలకొండపల్లికి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమంవ్యవసాయం: నగరంలోని 33/11 గాంధీచౌక్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ మోతీనగర్ ఫీడర్ పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏఈ మాళ్విక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాసవీ గార్డెన్, హర్కారా బావి, మూడుబొమ్మల సెంటర్, వడ్డెర కాలనీ, బోసుబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### 'విన్ ఫీల్డ్'లో యోగాపై అవగాహన

ఖమ్మం సహకారనగర్: యోగాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని విన్‌ఫీల్డ్ స్కూల్ డైరెక్టర్ పోలవరపు శ్రీకాంత్ అన్నారు. నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు భావోద్వేగాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. యోగా సంస్థకు చెందిన యోగా శిక్షకులు శిక్షణ ఇవ్వగా.. డైరెక్టర్లు మన్నె కిశోర్‌కుమార్, గద్దె పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న బాధితుడు

ఖమ్మంరూరల్: గత రెండు నెలల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తిరుమలాయపాలెం నుంచి ఖమ్మం వస్తున్న సమయాన చింతపల్లి వద్ద ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని ఆస్పత్రి తరలించి.. మెరుగైన చికిత్స అందించడంలో మంత్రి చొరవ చూపారు. ప్రస్తుతం తీవ్ర గాయాల నుంచి కోలుకున్న ఆ వ్యక్తి శనివారం కుటుంబ సమేతంగా ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి వచ్చి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## అటెన్షన్ ప్లీజ్

### గొంతెండుతోంది..!



మండలంలోని అప్పలనరసింహాపురంలో గొంతెండుతున్నా.. అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న 20 చేతి పంపులు మరమ్మతులకు నోచుకోక ఇదిగో ఇలా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామంలో తాగునీటి కోసం తిప్పలు తప్పవని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద గ్రామస్తులంతా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

– నేలకొండపల్లి